News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :236 | ఖమ్మం | సోమవారం అక్టోబర్ 6, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## రాష్ట్రంలో భారీ వర్షాలు.. దక్షిణ జిల్లాలు మినహా అన్నిచోట్లా వానలు..

### మరో నాలుగు రోజులూ దంచుడే..



- కామారెడ్డి, జగిత్యాల, భద్రాద్రి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో కుండపోత
- ములుగు జిల్లా మల్లంపల్లిలో అత్యధికంగా
- 9.8 సెంటీ మీటర్లు రికార్డ్
- మరో నాలుగు రోజులూ భారీ వర్షాలే.. ఎల్లో అలర్ట్‌జారీ

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడగా.. ఆ ప్రభావంతో ఆదివారం ములుగు, కామారెడ్డి, జగిత్యాల, భద్రాద్రి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్? జిల్లాల్లో కుండపోత వాన పడింది. దక్షిణాది జిల్లాలు మినహా రాష్ట్రమంతటా వర్షాలు పడ్డాయి. ములుగు జిల్లా మల్లంపల్లిలో

వివరాలు 2లో..



# బీసీ రిజర్వేషన్ల జీవోపై ఉత్కంఠ

- నేడు సుప్రీంకోర్టులో విచారణ
- బలమైన వాదనలు వినిపించాలన్న ముఖ్యమంత్రి
- రేవంత్ ఆదేశంతో ఢిల్లీకి భట్టి, పొన్నం, వాకిటి శ్రీహరి
- న్యాయవాదులతో భేటీ




బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోపై సోమవారం సుప్రీంకోర్టులో, 8న హైకోర్టులో విచారణ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. స్థానిక సంస్థల ఎన్నికల తొలిదశ నోటిఫికేషన్‌ను ఈ నెల 9న జారీచేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు జారీచేసిన జీవోపై సుప్రీంకోర్టులో జరగనున్న విచారణపై ఉత్కంఠ నెలకొంది. ఈ జీవో చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటు అధికారులను, అటు పార్టీ నేతలను ఆదేశించారు. ఈ అంశంపై ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కు మార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు సుదీర్ఘంగా చర్చించి సీఎంకు వివరాలు తెలిపారు. సీనియర్ న్యాయకోవిదులతో ముందే మాట్లాడాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో భట్టి, పొన్నం, వాకిటి శ్రీహరి ఆదివారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. స్థానిక సంస్థలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచార కార్యాచరణపైనా చర్చించినట్లు నేతలు తెలిపారు. భాజపా ఓటు చోరీకి వ్యతిరేకంగా ఈ నెల 16లోగా గ్రామగ్రామాన సంతకాల సేకరణ పూర్తిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని మీనాక్షి చెప్పినట్లు సమాచారం.

వివరాలు 2లో..

## పాకిస్థాన్ తో అలాంటి ఒప్పందమేమీ కుదుర్చుకోలేదు



- పాక్ కు రష్యా నిజంగానే సహకరిస్తోందా.. పుతిన్ ఏమన్నారంటే..!
- యుద్ధ విమానాల ఇంజన్ల సరఫరా వార్తలపై రష్యా అధ్యక్షుడి స్పష్టత
- భారత్‌కు ఇబ్బందికరంగా మారే చర్యలు తాము చేపట్టబోమని వెల్లడి

వివరాలు 2లో..

## బిట్‌కాయిన్ సరికొత్త చరిత్ర.. లక్షా 25 వేల డాలర్ల మార్క్ దాటి ఆల్ టైమ్ రికార్డ్!



- లక్షా 25 వేల డాలర్లను దాటిన వైనం
- వరుసగా ఎనిమిదో సెషన్ కూడా లాభాల్లోనే పయనం
- అమెరికా అనుకూల నిబంధనలతో పెరిగిన సంస్థాగత పెట్టుబడులు
- యూఎస్ డాలర్ బలహీనపడటం కూడా ఒక కారణంగా విశ్లేషణ
- పాకిస్థాన్‌తో ట్రంప్ కుటుంబ సంస్థ క్రిప్టో ఒప్పందంపై చర్చ

వివరాలు 2లో..

## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ



- పీజీ వైద్య విద్య మేనేజ్‌మెంట్ కోటా సీట్లపై హరీశ్ రావు స్పందన
- ఏపీలో 85 శాతం లోకల్ రిజర్వేషన్ ఉందని గుర్తు చేసిన హరీశ్
- ప్రస్తుత పీజీ నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు నష్టం జరుగుతోందని ఆరోపణ



# టమాట ధర ఢమాల్

## కిలో టమాటా ఒక్క రూపాయి... కర్నూలు జిల్లాలో రైతుల ఆగ్రహం



- పత్తికొండ మార్కెట్లో దారుణంగా పడిపోయిన టమాటా ధర
- కిలో రూపాయి మాత్రమే పలకడంతో రైతుల ఆగ్రహం
- రోడ్డుపై టమాటాలు పారబోసి నిరసన వ్యక్తం చేసిన రైతులు
- గిట్టుబాటు ధర కల్పించాలని, జ్యూస్ ఫ్యాక్టరీ పూర్తి చేయాలని డిమాండ్
- గుత్తి-మంత్రాలయం రహదారిపై భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్

వివరాలు 2లో..

## బస్సు చార్జీల పెంపు దారుణం: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్



- సిటీ బస్సు చార్జీల పెంపుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- ఒక్కసారే రూ.10 పెంచడం దుర్మార్గమైన నిర్ణయమన్న కేటీఆర్
- హైదరాబాద్ ప్రజలపై సీఎం కక్షగట్టారని విమర్శ

జంట నగరాల్లో సిటీ బస్సు చార్జీలను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక్కేసారి కనీస చార్జీని ఏకంగా 10 రూపాయలు

వివరాలు 2లో..

## మొయినాబాద్‌లో 50 మంది మైనర్లు.. మద్యం, డ్రగ్స్ పార్టీ

- పెద్దమంగళారం గ్రామ సమీపంలోని చెర్రీ ఓక్స్ ఫాంహౌస్‌పై రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసుల దాడి
- డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న 50 మంది మైనర్లు
- ఇద్దరికి గంజాయి పాజిటివ్
- ఆరుగురు నిర్వాహకులను అరెస్టు చేసిన పోలీసులు



హైదరాబాద్ నగర శివారుల్లోని ఫాంహౌస్‌లలో యువత రహస్యంగా డ్రగ్స్ పార్టీలు నిర్వహించడం ఈ మధ్యకాలంలో తరచుగా జరుగుతోంది. పోలీసులు ఆకస్మిక దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, పలు ప్రాంతాల్లో డ్రగ్స్ పార్టీల దందా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామం సమీపంలోని చెర్రీ ఓక్స్ ఫాంహౌస్‌పై పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశారు. అక్కడ కొందరు మైనర్లు డ్రగ్స్, మద్యం సేవించి పార్టీ చేసుకుంటున్నట్లు గుర్తించారు. సుమారు 50 మంది ఈ పార్టీలో పాల్గొన్నారని పోలీసులు తెలిపారు. వీరంతా ఇన్‌స్టాగ్రామ్‌లోని 'ట్రాప్‌హౌస్ 9ఎంఎం' అనే పేజీ ద్వారా పరిచయమయ్యారు. పార్టీలో మైనర్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

వివరాలు 2లో..

## డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- మహిళలకు హైదరాబాద్ కొత్త సీపీ సజ్జనార్ కీలక సూచన
- ప్రైవేట్ ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవద్దని స్పష్టీకరణ
- మోసగాళ్లు వాటిని సులభంగా దుర్వినియోగం చేస్తారని వెల్లడి
- ఎవరినైనా నమ్మేముందు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సలహా
- జిటో కనెక్ట్ 2025లో మహిళా పారిశ్రామికవేత్తలతో సీపీ భేటీ

వివరాలు 2లో..





## కార్మిక నాయకుడిగా కాకా చరిత్రలో నిలిచిపోయారు

దేశంలోనే కార్మిక నాయకుడిగా కాకా నిలిచిపోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్ర భారతిలో జరిగిన కాకా జయంతి ఉత్సవాల్లో పొన్నం మాట్లాడారు. రాజకీయ చరిత్రలో

వివరాలు 2లో..

# బ్యాంకుల్లో క్లైయిమ్ చేయని సొమ్ము 1.84 లక్షల కోట్లు

న్యూ ఢిల్లీ: బ్యాంక్ డిపాజిట్లు, బీమా, ప్రావిడెండ్ ఫండ్, షేర్లు ఇలా వివిధ రూపాల్లో బ్యాంక్లు, ఇతర సంస్థల వద్ద ఈ అన్ క్లెయిమ్ గా 1.84 లక్షల కోట్లు నగదు ఉందని ఆర్థిక మంత్రి చెప్పారు. ఈ మొత్తాలను అర్హులైన వారికి చేరేలా అధికారులు ఈ మూడు నెలల్లో అన్ని ప్రయత్నాలు చేయాలని సూచించారు. సరైన పత్రాలు సమర్పించి నగదు పొందాలని ఆమె కోరారు. ఈ సొమ్ముకు ప్రభుత్వం కస్టోడియన్ గా వ్యవహరిస్తోందన్నారు. అన్ క్లెయిమ్ డిపాజిట్ల కోసం ఆర్బీఐ ఒక పోర్టల్ ను రూపొందించిందని చెప్పారు. ఈ పోర్టల్ ద్వారా పౌరులు తమకు చెందిన నగదును క్లెయిమ్ చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత బ్యాంక్ల పై ఉందన్నారు. అవసరమైతే గ్రామాల్లోనూ బ్యాంక్లు ప్రచారం నిర్వహించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు.

## ఈ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్రంలో వ్యవసాయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే దిశగా, రైతులను నేరుగా పారిశ్రామిక రంగానికి అనుసంధానించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పూర్వోదయ స్కీం'ను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ అనుబంధ రంగాలలో రాష్ట్ర రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉద్యాన, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్, మైక్రో ఇరిగేషన్ రంగాలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో పాటు రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఆధునిక పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. "కేవలం పంటలు పండించడమే కాదు, పండించిన ఉత్పత్తులకు విలువ జోడింపు (వాల్యూ యాడిషన్) ప్రక్రియలను ప్రోత్సహించడం ద్వారా వాటి మార్కెట్ పరిధిని విస్తృతం చేయాలి. తద్వారా రాష్ట్రాభివృద్ధికి ఈ రంగాలు మరింతగా దోహదపడతాయి" అని ఆయన స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక డిమాండ్ ఉన్న ఉత్పత్తులపై అధ్యయనం చేసి, ఎగుమతులకు అనుకూలంగా ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి, మన వాతావరణానికి అనుకూలమైన కొత్త పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని వివరించారు.

**రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం**

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించాలన్నా, పంట నష్టం జరగకుండా ఉండాలన్నా ప్రతి రైతునూ ఏదో ఒక పరిశ్రమతో అనుసంధానించడమే సరైన మార్గమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్య సాధనలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్పీఓ) పాత్ర అత్యంత కీలకమని, వాటిని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఎఫ్పీఓలకు కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థికంగా అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. ఉద్యాన రైతులు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మధ్య సమన్వయం కోసం త్వరలోనే ఒక ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించాలని సూచించారు. అన్ని ఉత్పత్తులకు నాణ్యతా ధృవీకరణ (సర్టిఫికేషన్), ట్రేసబులిటీ వ్యవస్థలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

## పాకిస్థాన్ తో అలాంటి ఒప్పందమేమీ కుదుర్చుకోలేదని వివరణ

భారత్ తమకు చిరకాల మిత్రుడని చెబుతూనే పాకిస్థాన్ తో రష్యా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటోందని, యుద్ధ విమానాలకు ఇంజన్లు సరఫరా చేస్తోందని జరుగుతున్న ప్రచారాన్ని వ్లాదిమిర్ పుతిన్ కొట్టిపారేశారు. భారతదేశానికి ఇబ్బందికరంగా మారే చర్యలను తాము ఎట్టిపరిస్థితుల్లోనూ చేపట్టబోమని స్పష్టం చేశారు. యుద్ధ విమానాల సరఫరా కోసం పాకిస్థాన్ తో తాము ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదని పేర్కొన్నారు. భారత్‌తో పెద్ద ఎత్తున వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో.. పాక్‌కు మద్దతుగా తాము చర్యలు తీసుకుంటున్నట్లు ప్రచారాలు చేయడం సరికాదని రష్యా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే.. ఈ విషయంపై అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం.

**అసలు ఏం జరిగిందంటే..**

పాకిస్థాన్ సైన్యం వాడుతున్న జేఎఫ్ -17 ఫైటర్ జెట్ల (చైనా తయారీ) కు అవసరమైన ఇంజన్లను రష్యా సరఫరా చేస్తోందని పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు వెలువరించాయి. ఈ నివేదికలను ఉటంకిస్తూ.. కాంగ్రెస్ పార్టీ బీజేపీపై మండిపడింది. ప్రధాని మోదీ రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపార భాగస్వామిగా చెబుతారని, కానీ ఆ దేశం మన శత్రు దేశమైన పాక్‌కు మద్దతిస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ ఆరోపించారు.

ఇది ఇతర దేశాలతో సంబంధాల విషయంలో ప్రధాని మోదీ వైఫల్యాన్ని సూచిస్తుందని విమర్శించారు. జాతీయ ప్రయోజనాల కంటే ప్రధాని మోదీ తనకు పేరు వచ్చే విషయాలకే ప్రాధాన్యతనిస్తారని దుయ్యబట్టారు. రష్యా ఎందుకు పాక్‌కు సహకారాన్ని అందిస్తుందో మోదీ ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఇప్పటికీ దౌత్యం విషయంలో పాక్‌ను ఒంటరిని చేయలేకపోతున్నారని జైరాం రమేశ్ విమర్శించారు.

## బీసీ రిజర్వేషన్ల జీవోపై ఉత్కంఠ

మొదటి పేజీ తరువాయి

**రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం: పొన్నం**

ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సమావేశం అనంతరం... మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు తీసుకుంటున్న చర్యలను కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన రిజర్వేషన్లకు ఎలాంటి నష్టం కలిగించేది కాదని.. కోర్టుల్లో పిటిషన్లు దాఖలుచేసిన వారికి విజ్ఞప్తి చేస్తున్నానని ఆయన చెప్పారు. బలహీన వర్గాలకు చేయూతనివ్వాలనే సదుద్దేశంతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాహుల్‌గాంధీ ఆలోచనల అమలు ప్రక్రియలో భాగంగానే రిజర్వేషన్లను పెంచామన్నారు. అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయంతో అసెంబ్లీలో రిజర్వేషన్ల పెంపు బిల్లు ఆమోదం పొందిందని ఆయన గుర్తుచేశారు.

## మొయినాబాద్‌లో 50 మంది మైనర్లు.. మద్యం, డ్రగ్స్ పార్టీ

మొదటి పేజీ తరువాయి

రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు ఆరుగురు నిర్వాహకులను అరెస్టు చేశారు. పార్టీలో పాల్గొన్న ఇద్దరు మైనర్లకు డ్రగ్ టెస్టులో గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని అధికారులు వెల్లడించారు. అదనంగా 8 బాటిళ్ల విదేశీ మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు.. దక్షిణ జిల్లాలు మినహా అన్నిచోట్లా వానలు..

- మొదటి పేజీ తరువాయి

అత్యధికంగా 9.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కామారెడ్డి జిల్లా ఇసాయిపేటలో 8.7 సెంటీ మీటర్లు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 8.4, కామారెడ్డి జిల్లా పాత రాజంపేటలో 8.1, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంకంపాలెంలో 8, కోయగూడెంలో 7.6, కామారెడ్డిలో 7.3, జగిత్యాల జిల్లా మద్దుట్లలో 6.9, రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరులో 6.6, కరీంనగర్? జిల్లా వెంకెపల్లిలో 6.5, పెద్దపల్లి జిల్లా ఎలిగేడులో 6.5 సెంటీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. హైదరాబాద్? సిటీలోనూ శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయందాకా వర్షం దంచికొట్టింది. ఖైరతాబాద్‌లో అత్యధికంగా 4.7 సెంటీ మీటర్ల వర్షం కురిసింది.

**మరో 4 రోజులు వర్షాలు..**

రాష్ట్రంలో మరో 4 రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రానికి ఎల్లో అలర్ట్? జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్? సిటీలోనూ 4 రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే చాన్స్? ఉందని తెలిపింది.

# డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

డిజిటల్ ప్రపంచం ఓ మాయాజాలం... ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అంతే స్థాయిలో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి... ముఖ్యంగా మహిళలు ఆన్‌లైన్ వేదికలపై వ్యక్తిగత ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పొంచి ఉన్న ముప్పు గురించి వివరిస్తూ, మహిళలు మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని ఆయన కీలక సూచనలు చేశారు. నగరంలో జరుగుతున్న జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆయన మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, ఈ వేదికగా మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. "చాలామంది మహిళలు తమ ప్రైవేట్ ఫోటోలను, వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. కానీ వాటిని దుండగులు సులభంగా దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకొని, నమ్మించి మోసం చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోసపోయారని గ్రహించిన తర్వాత కూడా కొందరు వారితో సంభాషణలు కొనసాగిస్తున్నారని, ఇది మరింత ప్రమాదకరమని సజ్జనార్ స్పష్టం చేశారు. అలాంటి చర్యలు బ్లాక్‌మెయిలింగ్‌కు ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. "ఆన్‌లైన్‌లో ఎవరినైనా గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలి. డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో సజ్జనార్ మహిళల శక్తిసామర్థ్యాలను కొనియాడారు. హైదరాబాద్ పోలీస్ విభాగంలో తన బృందంలో దాదాపు 50 శాతం మంది మహిళా ఐపీఎస్ అధికారులే ఉండటం గర్వకారణంగా ఉందని అన్నారు. "వారు ఒకవైపు ఇంటి బాధ్యతలను, మరోవైపు కఠినమైన వృత్తిపరమైన విధులను ఎంతో అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. నేటి భారతదేశానికి మహిళలు ప్రతిఘటన, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన ప్రతీకలు. వారు మొత్తం ప్రపంచానికే స్ఫూర్తి, బలం" అని ఆయన ప్రశంసించారు. అక్టోబర్ 3న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించిన ఈ జిటో కనెక్ట్ 2025 ప్రదర్శన మూడు రోజుల పాటు సాగనుంది. ఇందులో 600కు పైగా స్టాళ్లు, ఆరు భారీ అరీనాలు ఏర్పాటు చేశారు. బిల్డ్ మార్ట్, బిజినెస్ బే, ప్రాపర్టీ పెవిలియన్ వంటి విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బాబా రాందేవ్, కమలేశ్ పటేల్ (దాదాజీ), సినీ నటుడు బొమన్ ఇరానీ, క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ వంటి పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

తెలంగాణలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న స్థానిక విద్యా ర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పీజీ సీట్లు అందుబాటులో ఉండగా, అందులో సగం రాష్ట్ర కోటా కింద భర్తీ అవుతాయని తెలిపారు. ఈ రాష్ట్ర కోటాలోని 25 శాతం, అంటే సుమారు 450 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయని వెల్లడించారు. అయితే, ఈ సీట్లలో స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించకపోవడంతో అవన్నీ ఓపెన్ కేటగిరీలో ఇతర రాష్ట్రాల వారికి దక్కుతున్నాయని హరీశ్ రావు తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. అదే విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తే, 450 సీట్లలో కేవలం 68 సీట్లు మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళతాయని, మిగిలిన 382 సీట్లు తెలంగాణ విద్యార్థులకే లభిస్తాయని ఆయన వివరించారు. ప్రస్తుత విధానం వల్ల మన విద్యార్థులు ఈ విలువైన అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాల కోసం కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, 2014 తర్వాత స్థాపించిన కాలేజీల్లో 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను స్థానికులకే కేటాయించామని హరీశ్ రావు తెలిపారు. దీనివల్ల ఏటా 1,820 అదనపు ఎంబీబీఎస్ సీట్లు మన విద్యార్థులకు దక్కాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.

ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం స్థానిక రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం జారీ చేసిన పీజీ ప్రవేశాల నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి, తెలంగాణ విద్యార్థుల హక్కులను కాపాడేలా కొత్త జీవో జారీ చేయాలని తన లేఖలో కోరారు.

# బిట్‌కాయిన్ సరికొత్త చరిత్ర.. లక్షా 25 వేల డాలర్ల మార్క్ దాటి ఆల్ టైమ్ రికార్డ్!

:ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. మునుపెన్నడూ లేని విధంగా 1,25,245.57 డాలర్ల ( ఒక బిట్‌కాయిన్ విలువ రూ.1.11 కోట్లు) వద్ద ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది ఆగస్టు మధ్యలో నమోదైన 1,24,480 డాలర్ల రికార్డును ఇది అధిగమించింది. నేటి మధ్యా హ్నం 2:54 గంటల సమయానికి కూడా బిట్‌కాయిన్ 1.55 శాతం లాభంతో 1,24,353.96 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. వరుసగా ఎనిమిది సెషన్ల పాటు లాభాల బాటలో పయనిస్తున్న బిట్‌కాయిన్, అమెరికా ఈక్విటీ మార్కెట్లలో సానుకూల పవనాలు, బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్‌లోకి (ఈటీఎఫ్) భారీగా నిధులు ప్రవహించడంతో ఈ రికార్డును అందుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం క్రిప్టో ఆస్తులలో పెట్టుబడులను సులభతరం చేసేలా నిబంధనలను సవరించడం, సంస్థాగత పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు మొగ్గు చూపడం వంటివి ఈ బుల్ రన్‌కు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. స్టేబుల్‌కాయిన్లపై నిబంధనలను ఆమోదించడం, డిజిటల్ ఆస్తులకు అనుగుణంగా యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) నిబంధనలను మార్చడం ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపింది. మరోవైపు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్‌పై నెలకొన్న అనిశ్చితి కారణంగా యూఎస్ డాలర్ విలువ ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే బలహీనపడింది. ఇది కూడా బిట్‌కాయిన్ పెరుగుదలకు పరోక్షంగా దోహదపడింది. సాధారణంగా బిట్‌కాయిన్ 'హాల్వింగ్' ఈవెంట్ తర్వాత ఇలాంటి దీర్ఘకాలిక ర్యాలీలు చోటుచేసుకుంటాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబానికి చెందిన 'వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్'

(డబ్ల్యూఎల్ఎఫ్) సంస్థ పాకిస్థాన్‌తో ఒక క్రిప్టోకరెన్సీ ఒప్పందంపై దృష్టి సారించిందని 'డిస్ఇన్ఫో ల్యాబ్' నివేదించింది. పాకిస్థాన్ కొత్తగా ఏర్పాటు చేసిన క్రిప్టో కౌన్సిల్ సీఈఓగా ఉన్న బిలాల్ బిన్ సాఖిబ్, అదే సమయంలో డబ్ల్యూఎల్ఎఫ్‌కు కూడా సలహాదారుగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. జూన్ 2025లో పాకిస్థాన్ ప్రభుత్వం డబ్ల్యూఎల్ఎఫ్, బినాన్స్‌లతో కలిసి బ్లాక్‌చెయిన్ మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు ఒప్పందాలు చేసుకున్న విషయం తెలిసిందే.

# టమాట ధర ఢమాల్

కంటికి రెప్పలా కాపాడుకున్న పంటకు కనీస ధర కూడా దక్కకపోవడంతో అన్నదాతలు కన్నీరు పెట్టుకున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో టమాటా ధర ఒక్కసారిగా కుప్పకూలింది. కిలో ధర కేవలం రూపాయికి పడిపోవడంతో ఆగ్రహించిన రైతులు, తాము పండించిన టమాటాలను రోడ్డుపై పారబోసి తీవ్ర నిరసన చేపట్టారు. టమాటాలతో నిండిన బుట్టలను రహదారిపై కుమ్మరించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నిరసన కారణంగా పత్తికొండలోని గుత్తి-మంత్రాలయం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. రైతులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. టమాటాకు గిట్టుబాటు ధర కల్పించాలని, అలాగే ఎప్పటినుంచో నిర్మాణంలో ఉన్న టమాటా జ్యూస్ ఫ్యాక్టరీని వెంటనే పూర్తి చేయాలని కోరారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, రైతులతో చర్చలు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. అష్టకష్టాలు పడి పండించిన పంటకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

# బస్సు చార్జీల పెంపు దారుణం: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

- మొదటి పేజీ తరువాయి

పెంచడం దుర్మార్గమని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో బస్సు చార్జీలు పెంచడం వల్ల ప్రతి ప్రయాణికుడిపై నెలకు అదనంగా 500 రూపాయల భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కనీస చార్జీపై ఏకంగా 50 శాతం పెంచడం దారుణమని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల బస్ పాస్ చార్జీలు, టీ-24 టికెట్ ధరలు పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రజలపైనా భారం మోపుతోందని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం విఫలమవడం వల్లే ఆర్టీసీ దివాళా తీసిందని, ఇప్పుడు ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. రాజధాని వాసులపై రోజుకు కోటి రూపాయల భారం మోపే ఈ నిర్ణయం, హైదరాబాద్ ప్రజలపై ముఖ్యమంత్రికి ఉన్న కక్షను స్పష్టం చేస్తోందని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# కార్మిక నాయకుడిగా కాకా చరిత్రలో నిలిచిపోయారు

- మొదటి పేజీ తరువాయి

కొందరి పేర్లు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని.. అందులో కాకా పేరు అగ్రస్థానంలో ఉంటుందన్నారు. కార్యకర్తగా మొదలై కేంద్రమంత్రిగా ఎదిగారని కొనియాడారు పొన్నం. కార్మిక రంగంలో కాకా తీసుకొచ్చిన సంస్కరణలు ఎవరు తేలేదన్నారు పొన్నం. బడుగు బలహీన వర్గాల గొంతుకగా కాకా నిలిచారని చెప్పారు. కాకా,ఎంఎస్సార్, చొక్కారావుల నుంచి ఎంతో నేర్చుకున్నానని చెప్పారు. కాకా వెంకటస్వామికి డైరెక్టుగా ప్రజలతో కనెక్షన్ ఉండేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రాణాలు అర్పించిన వ్యక్తి కాకా అని కొనియాడారు. కాకా వారసులు రాజకీయాల్లో రాణించారని.. కార్మికులకు కాకా కుటుంబానికి మంచి సంబంధాలున్నాయని తెలిపారు. చేపట్టిన అన్ని పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తి కాకా అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాకాది ప్రత్యేక స్థానం అని మంత్రి పొన్నం ప్రశంసించారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పోరాటం చేసి.. స్వరాష్టంలోనే ప్రాణాలు వదిలిన గొప్ప వ్యక్తి కాకా అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన అనుసరించిన మార్గం.. రాష్ట్ర ఏర్పాటుకు దారి చూపిందన్నారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. కాకా వంటి నేతల స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు పొన్నం.

# నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతుంది.

● భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 05,తొమ్మిది రోజులపాటు దుర్గాదేవి నవరాత్రులు పూజలు జరుపుకొని భద్రాచలంలోని గోదావరిలో నిమజ్జనానికి విగ్రహాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి కాక వివిధ జిల్లాల నుండి వస్తూనే ఉన్నాయని, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతుందని భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట అన్నారు.

ఆదివారం భద్రాచలంలోని గోదావరి కరకట్ట ప్రదేశాల లో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్క జిల్లాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా భద్రాచలం గోదావరిలో దుర్గాదేవి విగ్రహాలు నిమజ్జనం చేయడానికి రావడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు, ఐటీసీ మరియు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం సభ్యులు సమన్వయంతో దుర్గాదేవి పూజ భక్త మండల్ లకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా నిమజ్జనం కార్యక్రమం జరిపిస్తున్నారని, ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న దుర్గాదేవి విగ్రహాలు చాలా పెద్దవిగా ఉండడం తో నిమజ్జనం చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా అధికారులకు, ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులకు సూచించడం జరిగిందని, విగ్రహాలను క్రేన్ సహాయంతో తీసేటప్పుడు భక్తులు గాని చూడడానికి వచ్చే ప్రజలు గాని ఎవరూ దగ్గరకు రాకుండా చాలా జాగ్రత్తగా వారి వాహనాలలో నుంచి తీసి మెల్లగా గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారని అన్నారు. దుర్గాదేవి భక్తమండలి సభ్యులు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించి అతి భారీ దుర్గాదేవి విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేసే విధంగా అధికారులకు సహకరించాలని, అతి ఉత్సాహానికి పోయి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని, దుర్గామాత విగ్రహాలు నిమజ్జనం కాగానే సురక్షితంగా తమ గ్రామాలకు వెళ్ళిపోవాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, ఎం వి ఐ పుల్లయ్య, ఇరిగేషన్ డిఇ మధు,వెంకటేశం, జిపిఈఓ శ్రీనివాస్, సిఐ నాగరాజు, ఎన్ డి ఆర్ ఎఫ్, ఐ టి సి బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాబు క్యాంపులో మహా అన్నదానం

- అన్ని దానాలలో కన్నా.... అన్నదానం మిన్న
- బాబు క్యాంపు మాజీ ఎంపీటీసీ కూసన వీరభద్రం దంపతులు



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చుంచుపల్లి ప్రతినిధి, ( సాయి కౌశిక్ ), అక్టోబర్ 05,మండల పరిధిలోని బాబు క్యాంప్ నందు దేవి శరన్నవరాత్రుల ముగింపు వేడుక సందర్భంగా మండవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాబు క్యాంప్ మాజీ ఎంపీటీసీ , టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రం దంపతులు పాల్గొని వారు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని , అన్ని దానాలలో కన్న అన్నదానం మిన్న అని ఆయన అంటూ , కనకదుర్గమ్మ దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో , పాడి పంటలతో ఆరోగ్యంగా ఉండాలని అయన ఆకాంక్షించారు . అనంతరం ఆయన భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు .ఈ కార్యక్రమంలో మండప కమిటీ సభ్యులు , స్థానిక మహిళలు , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవుని కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రత్నకుమార్



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ సుజాతనగర్ ప్రతినిధి, ( సాయి కౌశిక్), అక్టోబర్ 05,సుజాతనగర్ మండలం గొల్లగూడెం గ్రామం లో ప్రముఖ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జక్కుల ఫాల్గుణ ఇంట్లో దేవుని కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు రత్నకుమార్, ప్రముఖ స్టాఫ్ రిపోర్టర్ కత్తి బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రత్నకుమార్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ సభ్యులు కుటుంబ స్థాయిలో దేవుని కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకం. ఫాల్గుణ వార్తల ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ సమాజానికి సేవ చేస్తున్నారు. అలాంటి జర్నలిస్టులు ఇలాంటివి చేయడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. ప్రెస్ క్లబ్ అనేది కేవలం వృత్తి వేదిక మాత్రమే కాదు, మనందరికీ ఒక కుటుంబం. ప్రతి సభ్యుడి ఆనందంలో, బాధలో మనమంతా భాగస్వాములమే" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు మీడియా ప్రతినిధులు, స్నేహితులు, బంధువులు పాల్గొని దేవుని ఆశీస్సులు అందుకున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నేత తుమ్మలపల్లి రమేష్ ..



తల్లాడ అక్టోబర్ 5 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్

తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సుంకర కోటేశ్వరరావు, శ్రీలత దంపతుల కుమారుడు రవికుమార్ వివాహాం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా నూతన దంపతులను కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్ హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి వెంకట నరసయ్య, దొడ్డా చిన్న శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

## కనకదుర్గమ్మ శోభాయాత్ర.



సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.మండలపరిధిలోనినాగులవంచ కచేరి సెంటర్లో కనకదుర్గమ్మ శోభాయాత్రవైభవంగాజరిగింది.ప్రధానవీధుల్లోబాణసంచాపేల్చుతూకోలాటంనృత్యాలుచేస్తూభారీలైటింగ్లసెట్టింగ్లతోఊరేగింపునిర్వహించారు.కార్యక్రమంలో పెద్ద ఎత్తునగ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## గిరిజన బాలికలకు వైయస్ఆర్‌సీపీ నేతల పరామర్శ



విశాఖ:సి కె న్యూస్ నగరంలోకి కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో చికిత్స పొందుతున్న గిరిజన బాలికలను వైయస్ఆర్‌సీపీ నేతలు పరామర్శించారు. ఐసోలేషన్ వార్డులో బాధిత బాలికలను మాజీ డిప్యూటీ సీఎంలు పుష్ప శ్రీవాణి, రాజన్న దొర, ఎంపీ తనూజా రాణి, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీను, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజ్, తదితరులు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాలికల తల్లితండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను పార్టీ నేతలు కోరారు.

## ప్రజావాణి రద్దు : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 05,జిల్లాలో జెడ్పీటీసీ మరియు ఎంపీపీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉండుటవలన, సోమవారంన జరగవలసిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయబడినది అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు తమ వినతిపత్రాలు, దరఖాస్తులు మరియు ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కార్యాలయం ఇన్వర్డ్ విభాగం లో సమర్పించవలసిందిగా, వాటిని సంబంధిత విభాగాలకు పంపబడతాయని ఆయన సూచించారు.

## ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన



సికే న్యూస్ ప్రతినిధి ఖమ్మం : తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం ఖమ్మం జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. పాలేరు, ఖమ్మం, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కూసుమంచి మండలం రాజుపేట గ్రామంలో కొర్ర రమేష్ నివాసంలో నూతన గృహప్రవేశ వేడుకకు హాజరై దంపతులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఖమ్మం నగరంలోని గుర్రం జగన్మోహన్‌రావు ఫంక్షన్‌హాల్‌లో 60వ డివిజన్ కార్పొరేటర్ బద్దె నిరంజన్ కుమారుని పంచెకట్టు వేడుక, అలాగే ఎస్.ఆర్. కన్వెన్షన్‌లో కాంగ్రెస్ నాయకుడు భీమనాధుల అశోక్‌రెడ్డి కుమార్తె ఓణీల అలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

మధిర మండలం ఆత్కూరు గ్రామంలో కంభంపాటి సురేష్ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి నూతన దంపతులకు ఆశీర్వాదాలు అందజేశారు. ఇల్లూరులో ఇటీవల వివాహం చేసుకున్న కోట రామారావు కుమారుడు, కోడలిని ఆశీర్వదించారు. మర్లపాడు గ్రామంలో అనారోగ్యంతో మరణించిన యువకుడు లక్ష్మా రెడ్డి కుటుంబాన్ని మంత్రి పరామర్శించి సానుభూతిని తెలిపారు.

వేంసూరు మండలం అడసర్లపాడు గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు అట్లూరి సత్యనారాయణరెడ్డి నిర్వహించిన చండీహోమంలో పాల్గొని పూజలు చేశారు. కుంచపర్తి గ్రామంలో కుక్కపల్లి రామకృష్ణ కుమారుడు, కోడలిని ఆశీర్వదించిన మంత్రి, శంభునిగూడెం గ్రామంలో అర్వపల్లి నరసింహారావు కుమారుని రిసెప్షన్‌లో పాల్గొన్నారు.

## జిల్లా అండర్ 14 బాయ్స్, అండర్ 17 బాయ్స్, గర్ల్స్ బాక్సింగ్ జట్టు ఎంపిక.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),అక్టోబర్ 05,

ఆదివారం కొత్తగూడెం సి.ఈ.ఆర్ క్లబ్ నందు గల నికత్ జరీనా బాక్సింగ్ రింగ్ నందు ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ జట్టు ఎంపికలు జరిగినవి. ఈ పోటీల్లో పథకాలు సాధించిన వారు అండర్ 14 బాయ్స్ 34- 36 కేజీ ల విభాగంలో ఆర్. గణేష్, 36-38 కేజీ ల విభాగంలో కే. ధనుష్, 28-30కేజీ ల విభాగంలో టి. మణికంఠ, 38-40 కేజీ ల విభాగం లో %ఎ%. పార్థు, 42-44 కేజీ ల విభాగంలో వీ.తనుష్ తేజేష్, 46-48 కేజీ ల విభాగంలో అబ్దుల్ హసన్, 48-50కేజీ ల విభాగంలో వీ. సాయి కిరణ్. అండర్ 17 బాయ్స్ 54-57 కేజీ ల విభాగంలో కే. అరుణ్ కృష్ణ, 46-48 కేజీ ల విభాగంలో షేక్ అరహాన్ అలీ, 52-54 కేజీ ల విభాగంలో వీ.భార్గవ్ తేజా, 57-60 కేజీ ల విభాగంలో సయ్యద్ అబ్దుల్ మాలిక్..అండర్ 17 గర్ల్స్ 46-48 కేజీల విభాగం లో టి.హాసిని, 52-54 కేజీల విభాగంలో బి.రూప, 54-57 కేజీ ల విభాగంలో కే. హారిక, 57-60 కేజీ ల విభాగంలో బి.జాహ్నవి, 60-63 కేజీ ల విభాగంలో పి.ఖ్యాతి భువన శ్రీ, 63-66 కేజీ ల విభాగం లో కే.సానియా అర్హత సాధించారు వీరు అందరూ కూడా రాష్ట్ర స్థాయిలో జరగబోవు బాక్సింగ్ పోటీల్లో పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు..

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్కూల్ గేమ్స్ సెక్రటరీ నరేష్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాక్సింగ్ సెక్రటరీ మట్టపర్తి రమేష్ మరియు బాక్సింగ్ కోచ్ మట్టపర్తి మానస మరియు శ్రీనివాస్ పాల్గొన్నారు..

## మల్లవరం ఊటవాగుకి రోడ్డు కి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు ఆందోళనలి..



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 5 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:తల్లాడ మండలంలోని మల్లవరం గ్రామంలో పొలాలకు వెళ్లే ఊటవాగుకు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని ఆదివారం ఆ గ్రామ రైతులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో ఉన్న ఆ ఊటవాగులోకి దిగి ఎలా వెళ్లాలంటూ ప్రశ్నిస్తున్నారు. ఓట్లు కోసం నిత్యం తిరిగే నేతలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా వైఫల్యం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో ప్రధాన సమస్య అయిన ఈ సమస్యను పరిష్కరించేంతవరకు ఓట్లు కూడా వేసేందుకు ముందుకు రామని భీష్మించుకుని కూర్చునే పరిస్థితి నెలకొంది. వివరాలు ప్రకారం.. మల్లవరం గ్రామం నుండి లోల్లూరుగూడెం తో పాటు పరిసర పొలాలకు వెళ్లాలంటే రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ వాగు కింద వందలాది ఎకరాలు సాగు విస్తీర్ణం జరుగుతాయి. అయితే వాగు ఉండటం వల్ల రైతులు అటువైపు వెళ్లేందుకు వాగులో నీరు ఉండటం వల్ల వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. అదే కాకుండా మహిళ రైతులు అయితే చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన అనేక మంది రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్ అనుదీప్ తో పాటు మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఈ ప్రధాన సమస్యను పరిష్కరించాలని వినతి పత్రాలు అందించారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మల్లవరం గ్రామ రైతులు ఆ వాగులోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామని అంటున్నారు. రైతులకు న్యాయం చేస్తామని చెబుతున్న నేతలు ఈ సమస్యను పరిష్కరించడంలో వెనకడుగు వేస్తున్నారని తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు కల్పించుకొని ఈ ప్రధాన సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామాల్లో ప్రారంభమైన ఎన్నికల వేడి

- పాత రిజర్వేషన్లపైనే ఆశావాహుల ఆశలు
- హస్తంతో దోస్తీకి సిపిఐ ప్రతిపాదనలు
- గులాబీ పార్టీతో జతకట్టేందుకు సిద్ధమైన సిపిఎం
- తెదేపా లేకున్నా సామాజిక వర్గం అండ హస్తానికే
- పొత్తుల ఎత్తుగడలతో రాజకీయ నాయకుల బిజీ
- హస్తం నాయకులకు స్థానిక గెలుపే లక్ష్యం ఫిక్స్




**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి**
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఎన్నికల తేదీలకు షెడ్యూల్ ప్రకటించే ప్రక్రియను పూర్తి చేయించడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధానంగా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో పాటు గెజెట్టును చేయడంతో ఆ మేరకు ఎంపీటీసీలు జడ్పీటీసీలు సర్పంచుల స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. దీంతో రాజకీయ భవిష్యత్తును అంచనా వేసుకొని ఊహల్లో కొనసాగుతూ వచ్చిన ఆశావాహులకు నిరాశే మిగిలింది. ప్రధానంగా ఈ ప్రభావం అధికార పార్టీ కాంగ్రెస్ శ్రేణులకు గ్రామస్థాయి నాయకత్వానికి ఆశనిపాతంగా మారిందని చెప్పవచ్చు. కాగా ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ పై సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ ఈ అంశాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు కావడం తో దానిగుణంగా విచారణ చేసిన హైకోర్టు బెంచ్ ఈనెల 8కి మరో మారు విచారణకు వాయిదా వేయడం తెలిసింది. రాజ్యాంగం లో పొందుపరిచిన విధంగా రిజర్వేషన్ల ప్రక్రియ 50% కుమించరాదన్న ప్రధాన అంశంతో ముడిపడి విచారణ జరగనున్న నేపథ్యంలో తప్పనిసరిగా 42 శాతం రిజర్వేషన్ పై ప్రతికూల తీర్పు వెలబడుతుందన్న ఆశలు ఆశవాహులకు జీవంపోసేలా కొనసాగుతున్నాయి. ఈ అంశంపై హైకోర్టు ఇచ్చే తుది తీర్పు పాత రిజర్వేషన్ల కు అనుకూలంగా మారితే తమకు ప్రయోజనం చేకూరుతుందన్న ఆశలు ఆశావాహులు ఉండడం గమనార్హం.

**అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు**
రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఈ నెల 9 నుండి తొలివిడత ప్రక్రియ ప్రారంభం కానుండడంతో గ్రామాల్లో అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీలు మల్ల గుల్లాలు పడుతున్నాయి. గ్రామాల్లో ఊహించని విధంగా రిజర్వేషన్లు రావడంతో అభ్యర్థుల ఎంపిక అనేది కష్టంగా మారింది. ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలలో అభ్యర్థుల ఎంపిక లో ప్రధానంగా ఆర్థిక పరిస్థితులు రాజకీయ నేపథ్యం ప్రాధాన్యత అంశాలుగా మారాయి. తప్పని పరిస్థితుల్లో ఎంపిక చేసే అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ఆయా పార్టీలపై ఉండనుండడంతో అంతంత మాత్రపు ఆర్థిక స్తోమత కలిగిన నాయకులు తమ గెలుపు కోసం కాకుండా వేరొకరి కోసం అప్పుల పాలయ్యే విధంగా మారిన ప్రస్తుత ఎన్నికల భారం మోయలేని పరిస్థితి.

**హస్తంతో జతకట్టేందుకు సిద్ధమైన సిపిఐ**
రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో మిత్రపక్షంగా కొనసాగుతున్న సిపిఐ పార్టీ ప్రస్తుతం జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో హస్తం పార్టీతో జతకట్టేందుకు సిద్ధమైంది. మధిర నియోజకవర్గంలో ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తో ఆ పార్టీ జిల్లా నాయకత్వం ప్రతిపాదనలను చేయడం జరిగింది. దానికి ఆయన నుండి సానుకూల సంకేతం అందడం జరిగిందని సమాచారం. 1 ఎంపీపీ ఒక జడ్పిటిసి ప్రతి మండలంలో 2 నుండి 3 గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులకు తమకు అవకాశం కల్పించాలని ప్రాథమికంగా సిపిఐ కోరినట్లు తెలిసింది. వీటిలో బోనకల్ మండలం ఎంపీపీ, చింతకాని మండలం జడ్పిటిసి స్థానాలు ప్రధానంగా ఉన్నాయి.

**గులాబీ పార్టీ తో కలిసి పోటీ కి సిపిఎం అడుగులు**
వామపక్ష పార్టీలకు కంచుకోటలుగా ఉన్న బోనకల్ చింతకాని ముదిగొండ మండలాల్లో పూర్తి స్థాయిలో , అదే క్రమంలో మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలో తమ సత్తాను చాటుకునేందుకు సిపిఎం పార్టీ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ప్రతిపక్ష టిఆర్ఎస్ పార్టీ అందించే స్నేహ హస్తం కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజ్ తో సిపిఎం పార్టీ నాయకత్వం ప్రాథమికంగా చేపట్టిన చర్చలు సానుకూలంగా ముగిసాయని తెలిసింది. అధికార కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గం లో గట్టి పోటీని ఇచ్చేందుకు గులాబీ పార్టీ పావులు కలుపుతుండగా, బలమైన ఓటు బ్యాంకు కలిగిన సిపిఎం పార్టీ తోడవడం ఆ పార్టీల అంచనాలకు బలం చేకూర్చేదిగా మారనున్నదని చెప్పవచ్చు. కాగా రెండు వామపక్ష పార్టీలు రాష్ట్రస్థాయి నాయకత్వాల నిర్ణయం మేరకు జిల్లా స్థాయిలో నియోజకవర్గస్థాయిలో పొత్తులకు యోచిస్తున్నట్లు సమాచారం . సిపిఐ పార్టీ సిపిఎం పార్టీతో కలిసి కాంగ్రెస్తో ఎన్నికల బరిలో దిగాలని అనుకుంటున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఇప్పటికే ప్రకటించగా, సిపిఎం పార్టీ నాయకత్వం ఇప్పటివరకు ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయకపోవడం గమనార్హం.

**తెదేపా లేకున్నా సామాజిక వర్గం అండపై హస్తం దృష్టి**
రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మిత్రపక్షంగా కొనసాగుతూ వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో హస్తంకు దూరంగా ఉండను%శీ%డడం అనేది అనివార్యంగా మారనుంది. అయినప్పటికీ ఆ పార్టీకి బలమైన కమ్మ సామాజిక వర్గం ప్రస్తుతం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటు బ్యాంకుగా మారడంతో పరోక్షంగా ఆ పార్టీ బలం కాంగ్రెస్కు తోడు కానున్నదని అంచనా.

**అభ్యర్థుల ఎంపిక గెలుపు బాధ్యతలపై భట్టి దిశానిర్దేశనం**
స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కు ముందు నుండే మధిర నియోజకవర్గంలో ఎంపీపీలు, జడ్పిటిసిలు, సర్పంచులు గెలుపు బాధ్యత పార్టీ నాయకులకు డిప్యూటీ సీఎం అప్పగించిన సంగతి తెలిసిందే.
ఇప్పటివరకు పార్టీ కోసం పని చేసిన గ్రామస్థాయి నాయకులకు రిజర్వేషన్ల ప్రక్రియలో అవకాశం లభించకపోవడంతో నాయకుల్లో కొంత నైరాశ్య%శీ% నెలకొన్నదనేది సుస్పష్టం. దీనికి తోడు కొత్తగా పార్టీలోకి చేరిన వారి ఆధిపత్యం ఆర్థిక సామాజిక ప్రభావాలు పాత నాయకులకు ఇబ్బందికరంగా మారడం తెలిసిందే. అయితే ప్రతి గ్రామంలో ఏ సమస్యలు ఉన్నాయి ఆ గ్రామంలో ఏ నాయకులు పార్టీ కోసం ప్రజల కోసం పనిచేస్తున్నారనేది తన మనసులో ఉన్నదని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానంటూ ఇటీవల డిప్యూటీ సీఎం పార్టీ శ్రేణులకు భరోసా కల్పించడం కొంత టానిక్ లా పనిచేస్తున్నదని చెప్పవచ్చు. పదేళ్ల శ్రమకుతోడు ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు భారం మోయాల్సి రావడంతో వీరికి ఎన్నికల ఫలితాలే వీరి ఎదుగుదలకు టార్గెట్ గా మారడం జరిగిందనేది చెప్పకనే చెప్పవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు అధికార పార్టీకి కొంతమేర సానుకూల పరిస్థితులకు అవకాశం కల్పించేదిగా సహజంగానే ఉండడం జరుగుతున్న క్రమంలో ఈవిడత జరిగే ఎన్నికలు కూడా అదే రీతిలో విజయ అవకాశాలను అందిస్తాయన్న ఆశలు కాంగ్రెస్ శ్రేణులలో ఉండడం కనిపిస్తోంది.

## మలేషియాలో భారతీయ ఐక్యతకు ప్రతీకగా “దసరా బతుకమ్మ దీపావళి 2025” వేడుకలు






**సి కె న్యూస్ ప్రతినిధి కౌలాలంపూర్:**మలేషియాలోని బ్రిక్ఫీల్డ్స్ ప్రాంతంలోని టానియా గ్రాండ్ బ్యాంక్వెట్ హాల్లో, భారతీయ అసోసియేషన్ ఆఫ్ మలేషియా (బి ఏ యం ) ఆధ్వర్యంలో “దసరా బతుకమ్మ దీపావళి 2025” ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి.
భారతదేశం నుండి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ఆశీస్సులు అందించారు. అలాగే భారత హైకమిషన్ ప్రతినిధులు, మలేషియా ప్రభుత్వ అధికారులు, మరియు వివిధ భారతీయ సంఘాల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకకు ప్రత్యేకతను చేకూర్చారు.
మహిళలు, పిల్లలు సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని, పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, తెలుగు సాంప్రదాయ పాటలతో ఆనందంగా నృత్యాలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.
ముఖ్య అతిథులు మాట్లాడుతూ “ఈ కార్యక్రమం తెలుగు వారికే కాకుండా, భారతదేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రతి భారతీయుడిని ఒక్క చోట చేర్చిన ఐక్యతా ఉత్సవం. మలేషియాలో భారతీయ సాంస్కృతిక ఐక్యతకు ఇది అద్దం పట్టింది” అని పేర్కొన్నారు.
బి ఏ యం అధ్యక్షుడు చొప్పరి సత్య మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన భారత హైకమిషన్, మలేషియా ప్రభుత్వ అధికారులు, అతిథులు, స్పాన్సర్లు, కమిటీ సభ్యులు, మరియు మలేషియాలోని భారతీయ సమాజా మనఃపూర్వక ధన్యవాదాలు’ అని తెలిపారు.
వేడుకల్లో పాల్గొన్న భారతీయులు పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. మలేషియాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు విస్తృతంగా హాజరై బి ఏ యం నిర్వహించిన ఈ మహోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బి ఏ యం ప్రధాన కమిటీ సభ్యులు చొప్పరి సత్య – అధ్యకుడు భాను ముత్తినేని – ఉపాధ్యక్షుడు రవితేజ శ్రీదశ్యం ప్రధాన కార్యదర్శి, ఐటీ మరియు పీఆర్ కమ్యూనికేషన్ రుద్రాక్షల సునీల్ కుమార్ ఖజాంచి గజ్జడ శ్రీకాంత్ – సంయుక్త ఖజాంచీ రుద్రాక్షల రవికిరణ్ కుమార్ యువజన నాయకుడు గీత హజారే మహిళా సాధికారత నాయకురాలు సోప్పరి నవీన్ కార్యవర్గ సభ్యుడు యెనుముల వెంకట సాయి కార్యవర్గ సభ్యుడు అపర్ణ ఉగంధర్ – కార్యవర్గ సభ్యుడు
సైచరణి కొండ – కార్యవర్గ సభ్యుడు ,రహిత – కార్యవర్గ సభ్యుడు
సోప్పరి రాజేష్ – కార్యవర్గ సభ్యుడు,పలకలూరి నాగరాజు – కార్యవర్గ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు

## దొంగలని అనుమానంతో నిప్పంటించిన యువకులు



నిందితులను రిమాండ్ కు తరలించిన పోలీసులు

**అక్టోబర్ 05 (సి కే న్యూస్) చేగుంట:** చేగుంట మండలం వడియారం గ్రామంలో దొంగలని అనుమానంతో నిప్పు అంటించిన యువకులు, తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి నిందితులను రిమాండ్ కు తరలించామని రామయంపేట్ సిఐ వెంకట్ రాజా గౌడ్ తెలిపారు,వివరాలకు వెళితే చిన్న శంకరంపేట మండలం లోని జంగరాయి గ్రామానికి చెందిన బందెల మోహన్, ఎర్రోళ మహిపాల్ ఇద్దరు కలిసి చేగుంట మండలంలోని వడియారం గ్రామంలోని ఎర్రోళ మహిపాల్ అత్తగారింటికి కలవడానికి వచ్చినారు. మధ్యరాత్రి సమయమున వారు తిరిగి వెళ్లే క్రమంలో బైక్ దగ్గర ఉన్న వాళ్ళు, వీళ్ళని బైకు దొంగలు అనే అనుమానంతో దొంతి రామకృష్ణ, గుండ్ల రమేష్, మరికూకల అనిల్ , కొంతమంది గ్రామస్తులు కలిసి వారిని పట్టుకుని కరెంటు స్తంభానికి,కట్టేసి దేహ శుద్ధి చేసి, అదే క్రమంలో మోహన్ జేబులో ఉన్న పెట్రోల్ తీసి అతని పైననే పోసి లైటర్ తో నిప్పంటించినారు. ఈ క్రమంలో బందెల మోహన్ కు తీవ్ర గాయాలు కావడంతో విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు అదే రోజు రాత్రి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించినారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నారు అని అన్నారు. మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ముగ్గురిని రిమాండ్కు తరలించామని సిఐ వెంకటరాజా గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం చేగుంట ఎస్ ఐ శ్రీ చైతన్య కుమార్ రెడ్డి కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## నూతన వ్యవసాయం మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావుని

ఘనంగా సన్మానించిన క్రైస్తవ సోదరులు.





**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.** ఈరోజు చింతకాని మండలం నాగులవంచ గ్రామం లో యేసుప్రభు ప్రార్ధన మందిరం ప్రాంగణంలో, మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా నియమితులైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ అంబటి వెంకటేశ్వరరావు కిజీలుగు రాధాకృష్ణ–పద్మ దంపతుల ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో జీలుగు గగనతేజ, గురజాల రమేష్, పడిశాల రాములు, ఉప్పు తల వెంకటయ్య, తురక సత్యనారాయణ, బైరు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


## మత్కేపల్లి గ్రామ క్రికెట్ టోర్నమెంట్ విజేత గని యూత్



**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం మత్కేపల్లి గ్రామంలో మేనేజ్మెంట్ టీం ఆధ్వర్యంలో, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కంచం కోటేశ్వరరావు నిర్వహించిన గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్లో “గని యూత్” అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది!
విజేతలకు ట్రోఫీతో పాటు ?10,116 నగదు బహుమతిని స్వయంగా కంచం కోటేశ్వరరావు అందజేశారు.
ఈ బహుమతి ప్రదానోత్సవం మిట్ట బజార్ లో పగడాల బాబురావు ఇంటి సమీపంలో జరిగింది.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వలమల నాగేశ్వరరావు వలమల వెంకట్రామయ్య గారు, సంకెళ్ళ పాపారావు చిర్ర పెద్ద వెంకటవీరయ్య , ఎరకలబోయిన శ్రీనివాసరావు ,రాజోలు తిరుపతిరావు పాల్గొన్నారు.
ఈ టోర్నమెంట్ నిర్వహించిన కంచం కోటేశ్వరరావు ని %జూవీ% పార్టీ సీనియర్ నాయకులు పగడాల బాబురావు మండల కమిటీ సభ్యులు జిల్లపల్లి పెద్ద పుల్లయ్య పగడాల కొండలరావు , పగడాల వెంకయ్య, పగడాల పట్టాభి,పగడాల గురవయ్య మొదలగువారు శాలువా తో సత్కరించడం జరిగింది.
గెలుపొందిన గని యూత్ టీం సభ్యులను మిట్ట బజార్ కాలనీ మహిళలు, గ్రామ పెద్దలు అభినందించారు.

## ప్రజల నీకు ప్రాణమో భట్టి యన్నో..

జనములోనే ఉంటావు మా అన్న భట్టాన్నో..



**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.**
పాతర్లపాడు గ్రామంలోని దుర్గామాత ఊరేగిపులో... తెలంగాణ ఉప ముఖ్యమంత్రి %ఞ%ఆర్థిక,విద్యుత్ శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క సాంగ్ తో..చింతకాని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కంచమూర్తి రామకృష్ణ %తీన%, మరియు యువత తో జయహో. భట్టి అని డాన్స్ వేస్తున్న దృశ్యం

# పవన్ నోట 'జెన్ జీ' మాటలు.. జనసేన ఫ్యూచర్ ప్లాన్ ఇదేనా?

'గత ఎన్నికల్లో మిలీనియల్స్ మనకు మద్దతుగా నిలిచారు. వచ్చే ఎన్నికల్లో జెన్ జడ్ వారిని ఆకట్టుకునేలా పనిచేయాలి' అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి రేపుతున్నాయి. ఇటీవల నేపాల్ అల్లర్ల సందర్భంగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'జెనరేషన్ గ్రూప్స్' మన దేశంలో రాజకీయంగా గుర్తింపు తెచ్చుకుంటున్నట్లు పవన్ వ్యాఖ్యల బట్టి అర్థమవుతోందని అంటున్నారు. నేపాల్లో జెన్ జెడ్ ఉద్యమంతో యువత అక్కడి ప్రభుత్వాన్ని గద్దె దింపారు. అయితే ఏపీలో కూడా గత ఎన్నికల్లో మిలీనియల్స్ గా చెప్పుకునే జనరేషన్ వై గ్రూపు కూటమికి మద్దతుగా నిలిచి అఖండ విజయాన్ని కట్టబెట్టారని పవన్ ఈ సందర్భంగా చెప్పారు.వారం రోజుల పాటు తీవ్ర జ్వరంతో బాధపడిన డిప్యూటీ సీఎం పవన్ ప్రస్తుతం కోలుకున్నారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఆయన జ్వరం బారిన పడటంతో ఎమ్మెల్యేలతో మాట్లాడలేకపోయారు. ఇక శనివారం రాష్ట్రానికి వచ్చిన డీసీఎం మంగళగిరి పార్టీ కార్యాలయంలో జనసేన శాసనసభాపక్ష సమావేశాన్ని నిర్వహించారు. సుమారు 3 గంటల పాటు నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యేలతో జనసేనాని మాట్లాడారు. ఇందులో ప్రధానంగా వచ్చే ఎన్నికలపై ఇప్పటి నుంచే దిశానిర్దేశం చేశారు. ప్రతి ఎమ్మెల్యేకు 5 నియోజకవర్గాల బాధ్యతలను అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలో అందరికీ సమప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.

ఇదే సమయంలో పవన్ మిలీనియల్స్ మద్దతుపై వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో మిలీనియల్స్ జనసేనకు అండగా నిలిచారని పవన్ వెల్లడించారు. 'మనం ఇప్పుడు మిలీనియల్స్ ఆకాంక్షలు గ్రహించాలి. జెన్ జీ తరంతోనూ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ చర్చిస్తూ ఉండండి. వాళ్లు ప్రతి విషయాన్ని గమనిస్తూనే ఉంటారు' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం రుషికొండ ప్యాలెస్ ను నిర్మించి వందల కోట్లు వృథా చేసిందన్న విషయం తెలిసిన యువత



జనసేనతో కలిసి నడిచినట్లు పవన్ వెల్లడించారు.

1981 నుంచి 1996 మధ్య జన్మించిన వారిని మిలీనియల్స్ లేదా జనరేషన్ వైగా పిలుస్తారు. వీరు కంప్యూటర్లు, ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన సమయంలో పెరిగారు. ఇక 1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారిని జనరేషన్ జెడ్ గా పిలుస్తున్నారు. నేపాల్ లో ఉద్యమించిన ఈ తరం అక్కడి ప్రభుత్వాన్ని గద్దె దిగేలా చేసింది. ఇక పవన్ చెప్పిన ప్రకారం గత ఎన్నికల్లో 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువత జనసేనకు అండగా నిలిచారని విశ్లేషిస్తున్నారు. వాస్తవంలో కూడా ఇదే నిజమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. యువత మద్దతు పొందితే భవిష్యత్తులోనూ బలంగా ఉండొచ్చే ఆకాంక్ష పవన్ మాటల్లో కనిపిస్తోందని అంటున్నారు. ఇదే సమయంలో భవిష్యత్తు తరాన్ని ఆకట్టుకునేలా అడుగులు వేయాలని పవన్ సూచిస్తున్నారు. దీనిద్వారా జనసేన ఫ్యూచర్ ప్లాన్ రెడీ చేశారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# భారత్ నెగ్గి వారం..ఆసియా కప్ ఎత్తుకెళ్లిన నఖ్వీకి గోల్డ్ మెడల్

: టీమ్ ఇండియా ఆసియా కప్ ఫైనల్లో గెలిచి 8 రోజులు అవుతోంది. గత ఆదివారం జరిగిన తుది సమరంలో మన జట్టు గెలిచాక ట్రోఫీని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్, ఆ దేశ మంత్రి కూడా అయిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీఏ) చైర్మన్ మొహిసిన్ నఖ్వీ నుంచి తీసుకునేందుకు నిరాకరించింది. దీంతో నఖ్వీ ట్రోఫీని తనతో పాటు దుబాయ్ లోని హెూటల్ కు తీసుకెళ్లిపోయాడు. అప్పటినుంచి కప్ ఎక్కడ ఉన్నదీ తెలియడం లేదు. మంగళవారం జరిగిన ఏసీఏ సమావేశంలో వర్చువల్ పాల్గొన్న నఖ్వీ.. బీసీసీఐ ఉపాధ్యక్షుడు శుక్లా నిలదీసినప్పటికీ ట్రోఫీ ఇంతవరకు అప్పగించలేదు. టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వచ్చి తన నుంచి ట్రోఫీ తీసుకెళ్లాలని కోరాడు. దీనికి బీసీసీఐ ససేమిరా అని చెప్పింది.

**ఇంతకూ ఎక్కడ దాచాడు?**

ఆసియా కప్ ట్రోఫీ భారత్ కు వచ్చేది ఎలా...? నఖ్వీ అప్పగించేది ఎప్పుడు? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. నఖ్వీ ఆసియా కప్ ట్రోఫీని దుబాయ్ లో యూఏఈ క్రికెట్ బోర్డు కార్యాలయంలో ఉంచుతానని, అక్కడినుంచి తీసుకెళ్లాలని చెప్పినట్లు కథనాలు వచ్చాయి. కానీ, అదేమీ జరగలేదు. అసలు పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి అయిన నఖ్వీ చేతులు తాకిన ట్రోఫీ భారత్ కు అవసరమా? అనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి.



**మంత్రే కాదు.. మీడియా అధిపతి కూడా**


మొహిసిన్ నఖ్వీని పాకిస్థాన్ లో మీడియా మొఘల్ అంటారు. పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రిగా ఉన్న అతడు ఈ ఏడాది ఏప్రిల్ లో ఏసీఏ అధ్యక్షుడు అయ్యాడు. తాజాగా ఆసియా కప్ లో పాక్ పేసర్ హారిస్ రవూఫ్ చేసిన ఆరు ఫైటర్ జెట్ ల సంకేతానికి 30 శాతం మ్యాచ్ ఫీజు ఎదుర్కొన్నాడు. ఈ ఫీజును తానే కడతానని నఖ్వీ చెప్పినట్లుగా కథనాలు వచ్చాయి. ఫైనల్ అనంతరం ట్రోఫీని నఖ్వీ తనతో తీసుకెళ్లడంతో వివాదం మరింత ముదిరింది.

ఇప్పుడు మళ్లీ నఖ్వీ ప్రస్తావన ఎందుకు అంటే... అతడికి గోల్డ్ మెడల్ వచ్చిందట.

**కప్ ఎత్తుకెళ్లినందుకు బహుమానం...?**

పాక్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో పేరిట ఏర్పాటు చేసిన ఎక్స్ లెన్స్ గోల్డ్ మెడల్ ను నఖ్వీకి ఇవ్వాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. దేశ గౌరవాన్ని నిలబెట్టిన నాయకుడిగా ఈ అవార్డు ఇస్తున్నారట. కరాచీలో జరిగే వేడుకలో అవార్డును నఖ్వీ అందుకోనున్నట్లు తెలుస్తోంది. జుల్ఫికర్ అలీ భుట్టో మాజీ ప్రధాని తండ్రి, ప్రస్తుత పాకిస్థాన్ మంత్రివర్గంలో నఖ్వీకి సహచరుడు అయిన బిలావల్ భుట్టోకు తాత. పాక్ మాజీ అధ్యక్షుడు అసిఫ్ జర్దారీకి మామ.కాగా భారత్ కు ట్రోఫీ అప్పగించకపోవడంపై క్రీడా వర్గాలు నఖ్వీని తీవ్రంగా తప్పుబడుతున్నాయి. పాకిస్థాన్ లో మాత్రం అతడిని భారత్ కు తలవంచని నాయకుడిగా కీర్తిస్తుండడం గమనార్హం.

# ఇక మిగిలింది 15 లక్షలు.. చంద్రబాబుకు బిగ్ టార్గెట్



ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై ఫోకస్ చేస్తోంది. సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారం అందుకున్న కూటమి నేతలు.. ఆర్థిక ఇబ్బందులు చూపి తొలి ఏడాది సంక్షేమ పథకాల ఊసులేకుండా కాలం నెట్టుకొచ్చారు. ఇక రెండో ఏడాదిలోకి అడుగు పెడుతూనే తల్లికి వందనం పథకంతో సంక్షేమ పథకాల జాతరకు తెర తీశారు. ఆ తర్వాత అన్నదాతా సుఖీభవ, స్త్రీశక్తి పథకాలను అమలు చేశారు. ఇక తాజాగా ఎన్నికల హామీ కాకపోయినా, ఆటోడ్రైవర్ల సేవలో పథకానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన 20 లక్షల ఉద్యోగాల కల్పనకు వడివడిగా అడుగులు వేస్తున్నారు.

కూటమి సూపర్ సిక్స్ హామీల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రధానమైనది. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి చూపే ఈ హామీపై ప్రజలు చాలా ఆశలే పెట్టుకున్నారు. ఎన్ని నగదు బదిలీ పథకాలు ప్రవేశపెట్టినా ప్రజలకు దక్కని సంతృప్తి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం ద్వారా శాశ్వత ఆనందం కల్పించవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. దీంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో గత ఎన్నికల్లో భారీ విజయాన్ని కట్టబెట్టారని అంటున్నారు. ఇక అధికారం చేపట్టిన తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పై చేసిన చంద్రబాబు.. 16 నెలల తరవాత దాదాపు 16 వేల మందికి పోస్టింగులిచ్చారు.నిజానికి మెగా డీఎస్సీ ద్వారా ఎప్పుడో ఉద్యోగాలను భర్తీ చేయాల్సివున్నా, అనేక న్యాయవివాదాల వల్ల నోటిఫికేషన్ జారీ చేయడమే పెద్ద సవాల్ గా మారింది. అన్నిరకాల అవాంతరాలను అధిగమించిన తర్వాత నోటిఫికేషన్ జారీ చేసి 150 రోజుల్లోనే నియామక ప్రక్రియ భర్తీ చేయడం ఉపాధ్యాయ అభ్యర్థులను ఆశ్చర్యానికి గురి చేసింది. అంతేకాకుండా ఇకపై ఏటా డీఎస్సీ ప్రకటన ఉంటుందని చెప్పడం ద్వారా నిరుద్యోగుల్లో సరికొత్త ఆశలు రేకెత్తించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఒక్కపోస్టు కూడా భర్తీ చేయకపోవడం, తన 15 ఏళ్ల పాలనలో 14 డీఎస్సీలు వేసిన చంద్రబాబు ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలకు బ్రాండ్ అంబాసిడరుగా పేరు తెచ్చుకున్నారు. ఇక ప్రస్తుత ప్రభుత్వంలో మెగా డీఎస్సీ ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనలో తొలి అడుగు వేసిన చంద్రబాబు.. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కలిపి ఇప్పటివరకు 4.71 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెబుతున్నారు.ఉపాధ్యాయులు, పోలీసు, వివిధ ప్రైవేటు శాఖల్లో కాంట్రాక్టు ఔటు సోర్సింగ్ సిబ్బందితోపాటు నైపుణ్య శిక్షణ ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పించినట్లు ప్రభుత్వం చెబుతోంది. ఇక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఇంకా 15 లక్షల ఉద్యోగాలను సాధించాల్సివుందని అంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు దాదాపు 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకువచ్చారు. వీటిద్వారా 9 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు నిర్మాణ పనులు ప్రారంభించడం, ఐటీ పరిశ్రమలు ప్లగ్ అండ్ ప్లే విధానంలో కార్యలాపాల నిర్వహణకు సిద్ధంగా ఉండటంతో త్వరలో మరికొన్ని లక్షల ఉద్యోగాలు భర్తీ అయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఈ క్రమంలోనే వచ్చే నెలలో విశాఖలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో భారీగా పెట్టుబడులు సాధించాలని టార్గెట్ పెట్టుకున్న ప్రభుత్వం ఆ దిశగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించిందని చెబుతున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రులు పలు దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలను కలుస్తూ విశాఖ సదస్సుకు ఆహ్వానిస్తున్నారు. దీంతో వచ్చేనెలలో ఏపీలో పరిశ్రమల స్థాపనకు పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదిరే అవకాశాలు ఉన్నాయని ఆశిస్తున్నారు. కనీసం పది లక్షల కోట్ల పెట్టుబడులు పది లక్షల ఉద్యోగాలు వచ్చేలా ఒప్పందాలు చేసుకోడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని అంటున్నారు. దీంతో కూటమి ఎన్నికల హామీ 20 లక్షల ఉద్యోగాల కల్పనను నెరవేర్చే దారి లభిస్తుందని భావిస్తున్నారు. ఇక వచ్చే మూడేళ్లలో ఈ పెట్టుబడులను గ్రౌండింగ్ చేయడం వల్ల యువత ఉద్యోగాల్లో చేరే అవకాశం ఉందంటున్నారు. ఈ కారణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు టార్గెట్ 15 లక్షల ఉద్యోగాలు అన్న ఆశయంతో అడుగులు వేస్తున్నట్లు కూటమి నేతలు చెబుతున్నారు.

# 10 మంది పిల్లల ప్రాణాలు తీసిన దగ్గుమందు.. సంచలన నిర్ణయాలు

మధ్యప్రదేశ్లో మరో విషాదం చోటుచేసుకుంది. చింద్వారా జిల్లాలో పిల్లలకు ఇచ్చిన దగ్గు సిరప్ ప్రాణాంతకమై 10 మంది చిన్నారులు మరణించడంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేగింది. ఈ సంఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుండగా, బాధ్యులపై చర్యలు మొదలయ్యాయి.



**డాక్టర్ ప్రవీణ్ సోని అరెస్టు**

ఈ ఘటనలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ సోనిని పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. దర్యాప్తులో ఆయనే ఎక్కువమంది బాధిత చిన్నారులకు ఆ సిరప్‌ను సూచించినట్లు తేలింది. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని తీవ్రంగా విచారిస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ విషాదం సంభవించిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తయారీ కంపెనీపై కేసు నమోదు**

ఈ ఘటనలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. బాధితులు ఉపయోగించిన సిరప్ తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ తయారు చేసినదే అని అధికారులు గుర్తించారు. ప్రయోగశాల విశ్లేషణలో ఆ మందులో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఈ రసాయనం అత్యంత విషపూరితమైనదిగా, మానవ శరీరానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదే పదార్థం గతంలో గాంబియా, ఉజ్బెకిస్తాన్‌లలో చిన్నారుల మరణాలకు కారణమై ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**డైఇథైలిన్ గ్లైకాల్ అంటే ఏమిటి?**

డైఇథైలిన్ గ్లైకాల్ సాధారణంగా పారిశ్రామిక వినియోగాల కోసం ఉపయోగించే రసాయనం. ఇది ల్యూబ్రికెంట్లు, యాంటీఫ్రీజ్ ద్రావణాలు తయారీలో ఉపయోగిస్తారు. కానీ, ఔషధ ఉత్పత్తుల్లో ఇది అనుమతించబడదు. చిన్న పరిమాణంలోనే ఈ పదార్థం శరీరంలోకి చేరినా కిడ్నీలను, కాలేయాన్ని దెబ్బతీసి మరణానికి దారి తీస్తుంది.

**అధికారుల కఠిన చర్యలు**

సిరప్ నమూనాలను పరీక్షించడానికి కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (%జఉూజూ%) బృందం ఇప్పటికే నమూనాలు సేకరించింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ ఈ సంఘటనపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు శ్రీసన్ ఫార్మా యూనిట్‌పై %ఖూజ% సెక్షన్లు 304 (అజాగ్రత్త కారణంగా మరణం), 274 (విషపూరిత మందుల తయారీ) కింద కేసులు నమోదు చేశారు.

**ప్రజల్లో భయం, ఆగ్రహం**

ఈ ఘటనతో తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చిన్నారుల మరణం స్థానికంగా పెద్ద కలకలాన్ని రేపింది. చింద్వారాలో ప్రజలు ఆసుపత్రుల వద్ద నిరసనలు వ్యక్తం చేస్తూ బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రధానమంత్రి కార్యాలయం స్పందన**

కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఘటనపై దృష్టి సారించింది. ప్రధాని కార్యాలయం ఆరోగ్య మంత్రిత్వశాఖ, ఔషధ నియంత్రణ సంస్థలతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా పిల్లలకు ఇచ్చే మందులపై ప్రత్యేక తనిఖీలు చేయాలని సూచనలు జారీ చేసింది.

**నిపుణుల హెచ్చరిక**

పిల్లలకు ఔషధాలు ఇవ్వేటప్పుడు తప్పనిసరిగా వైద్య నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. లైసెన్స్ లేని లేదా నకిలీ మందులను కొనుగోలు చేయకూడదని తల్లిదండ్రులను హెచ్చరిస్తున్నారు. చింద్వారా విషాదం మరోసారి ఔషధ భద్రతా వ్యవస్థలపై ప్రశ్నలు లేవనెత్తింది. నిబంధనలను కచ్చితంగా అమలు చేయకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# 52 ఏళ్ల వయసులో గోల్డ్ మెడల్... ఈ స్టైలిష్ షూటర్ మామూలోడు కాదు!




పారిస్ లో గత ఏడాది తుర్కిష్ షూటర్ యూసుఫ్ డికెక్ స్టైల్ నెట్టింట సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. మను, సరబ్ జోత్ లు కాంస్య పతకం గెలుచుకున్న అదే మ్యాచ్ లో తన షూటింగ్ పార్టనర్ సెవ్వల్ ఇల్యాదా తర్హాన్ తో కలిసి యూసుఫ్ డికెక్.. ఒక చేతిని జేబులో పెట్టుకుని షూటింగ్ చేసి రజత పతకం సాధించారు. ఈ క్రమంలో తాజాగా మరో రికార్డ్ సృష్టించాడు డికెక్.అవును... సాధారణంగా షూటింగ్ లో పాల్గొనే అథ్లెట్లు తమ చెవులకు ఇయర్ ప్రొటెక్టర్లు, లక్ష్యాన్ని గురిచూసేందుకు సాయపడే లెన్సులు, బ్లైండర్ల వంటివి ధరిస్తారు. ఇందులో భాగంగా... కంటిపై పడే వెలుతురుని తగ్గించేందుకు ఒక కన్నుపై వైజర్, స్పష్టమైన దృష్టి కోసం మరో కంటిపై బ్లైండర్ ధరిస్తారు. పైగా... వీటిని షూటింగ్ కు తప్పనిసరైన అవసరాలుగా పరిగణిస్తారు.అయితే... యూసుఫ్ డికెక్ మాత్రం ఇవేవీ ధరించడు. ఇవేవీ లేకుండానే షూటింగ్ రేంజ్ కు వెళ్లి, లక్ష్యాన్ని ఛేదించి రజతం సాధించాడు. ఈ క్రమంలో తాజాగా తుర్కియే లో జరుగుతున్న యూరోపియన్ ఛాంపియన్స్ లీగ్ - 2025లో ఐకానిక్ షూటర్ యూసుఫ్ డికెక్ తుర్కియేకు స్వర్ణం అందించాడు. దీంతో... ఇతడి పెర్ఫార్మెన్స్ మరోసారి సంచలనంగా మారింది.

వివరాళ్లోకి వెళ్తే... ఇస్తాంబుల్ లో జరిగిన యూరోపియన్ ఛాంపియన్స్ లీగ్ ఆఫ్ ఎయిర్ వెపన్స్ లో తుర్కియే జాతీయ షూటింగ్ జట్టు మూడు బంగారు పతకాలను గెలుచుకుంది. ఈ సమయంలో తన విలక్షణమైన శైలితో పారిస్ - 2024 ఒలింపిక్స్ లో ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయిన షూటర్ యూసుఫ్ డికెక్.. మరోసారి స్వదేశంలోని విజయాలలో ముందంజలో ఉన్నాడు.ఇందులో భాగంగా... పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఫైనల్ లో ముస్తఫా ఇనాన్ తో కలిసి డికెక్.. జర్మనీకి చెందిన క్రిస్టియన్ రీట్జ్, పాల్ ఫ్రోహ్లిచ్ లను 2-0 తేడాతో ఓడించి, తుర్కియేకు స్వర్ణం సాధించిపెట్టాడు. దీంతో మరోసారి ఇతడి పెర్ఫార్మెన్స్ సంచలనంగా మారుతోంది.ఈ సందర్భంగా స్పందించిన డికెక్.. విజయం, సొంత గడ్డపై పోటీ పడే అవకాశం రెండింటి పట్ల గర్వం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా... యూరోపియన్ ఛాంపియన్స్ లీగ్ అనేది అత్యుత్తమ అథ్లెట్ల కోసం కేటాయించబడిన ప్రత్యేక వేదిక అని అన్నారు. ఇదే సమయంలో.. ఇస్తాంబుల్ లో తొలిసారిగా జరుగుతున్న ఈ టోర్నమెంట్ తో తన దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం అని తెలిపారు.మరోవైపు తుర్కియే విజయం మహిళల ఈవెంట్లకు కూడా విస్తరించింది. ఇందులో భాగంగా... 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో డామ్లా కోస్, ఎలిఫ్ బెర్ఫిన్ ఆల్టున్ నార్వేను ఓడించి స్వర్ణం సాధించారు. ఇదే సమయంలో... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఫైనల్ లో ఫ్రాన్స్ ను ఓడించి ఎస్రా బోజబలి, సెవ్వాల్ ఇలైడా తర్హాన్ కూడా స్వర్ణం సాధించారు! ఈ విజయాలతో తుర్కియే మూడు స్వర్ణ పతకాలను సాధించినట్లయ్యింది.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

# కండకు జై...

ఊబకాయం.. ముఖ్యంగా బొజ్జ పెద్ద ప్రజారోగ్య సమస్యగా పరిణమిస్తోంది. మనదేశంలో జాతీయ కుటుంబ ఆరోగ్య గణన-5లో (2019-2021) తొలిసారిగా బొజ్జ తీరుతెన్నులను లెక్కించారు. ఇందులో ఆందోళనకర విషయాలు వెల్లడయ్యాయి. శరీర ఎత్తు, బరువు నిష్పత్తి (బీఎంఐ) ప్రకారం కేవలం 23% మహిళలే ఊబకాయులుగా లెక్కలోకి వచ్చారు. అయితే 30ల్లో, 40ల్లో ఉన్న స్త్రీలలో సగాని కన్నా ఎక్కువమంది బొజ్జ కలిగుండటం గమనార్హం. అదే మగవారిలో 12% మందిలోనే ఇది కనిపించింది. అంటే అదృశ్యంగా ఉన్న జీవక్రియ ముప్పును నార్మల్ బీఎంఐ బయటపడకుండా చేస్తోందన్నమాట. ఇది కండర క్షీణతనూ కప్పిపుచ్చుతుండటం గమనార్హం.

నిజానికి శరీర బరువు అంటే కొవ్వు ఒక్కటే కాదు. ఎముకలు, అవయవాలు, నీరు, ఎముకలకు అంటుకొని ఉండే కండరం, అనుసంధాన కణజాలాల వంటివన్నీ ఇందులో భాగమే. వీటిల్లో కండరబంధనాల ద్వారా ఎముకలకు అంటుకొని ఉండే కండరాన్ని (స్కెలెటల్ మజిల్) ఆరోగ్యాన్ని ఉరకలెత్తించే యంత్రం అనుకోవచ్చు. కదలికలు, జీవక్రియలు, బలానికిది కీలకం. వయసు పెరుగుతున్నకొద్దీ క్రమంగా కండరాల మోతాదు, వీటి బలం, పనితీరు క్షీణించటం (సార్కోపీనియా) మొదలవుతుంటుంది. ఇప్పుడు దీన్ని వైద్యపరంగా ఒక రుగ్మతగానూ పరిగణిస్తున్నారు. శరీర దౌర్బల్యం, కింద పడటం, వైకల్యం, రోజువారీ పనులు చేసుకోలేకపోవటం వంటివి దీని పరిణామాలే. అరవై ఏళ్లలోపు వారిలో 8-36% మంది.. వృద్ధుల్లో 10-27% మంది కండర క్షీణతతో బాధపడుతున్నారని అంచనా. సాధారణంగా ఇది ఆడవారిలో కన్నా మగవారిలోనే ఎక్కువ.

**మధ్యవయసులో గరిష్ఠంగా**

కండర మోతాదు, బలం 30-50 ఏళ్ల మధ్య గరిష్ఠ స్థాయిలో ఉంటాయి. అనంతరం నిరంతరం క్షీణిస్తూ వస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా 60 ఏళ్లు పైబడ్డవారిలో 140 కోట్ల కన్నా ఎక్కువ మంది వయసుతో ముడి పడిన కండర క్షీణతతో బాధపడుతున్నారు. ఇదో ప్రజారోగ్య సమస్యగా విజృంభిస్తోంది. కండరాల బలహీనత కేవలం వాటి మోతాదు తగ్గటాన్ని మాత్రమే కాదు, రోజువారీ పనులు హాయిగా చేసుకోకుండా అడ్డుపడటాన్నీ పట్టి చూపుతుంది. కండలోకి కొవ్వు చొచ్చుకుపోతున్న
కొద్దీ కండర సామర్థ్యమూ తగ్గుతూ వస్తుంది.

**ఏంటీ కండ గొప్పతనం?**

కండరం కేవలం యాంత్రిక కణజాలం కాదు. ఇది జీవక్రియలను ఉత్తేజితం చేస్తుంది. గ్లూకోజును, శక్తి సమతుల్యతను, ఒంట్లో ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. గ్లైకోజెన్, ప్రొటీన్, కొవ్వును నిల్వ చేసుకుంటుంది. ఊబకాయుల్లో కండరాల్లో కొవ్వు ఎక్కువగా చేరటం వల్ల బలం, నాణ్యత తగ్గుతాయి. ఇవి కండర క్షీణతతో మరింత ఎక్కువవుతాయి కూడా. ఎముకల పటుత్వం, జీవక్రియల సమతుల్యత తగ్గుతాయి. గుండె రక్తనాళాల జబ్బుల ముప్పూ పెరుగుతుంది. అందువల్ల బరువు తగ్గించుకోవటానికి ప్రయత్నించేటప్పుడు కండరాలను కాపాడుకోవటం చాలా కీలకం. దీన్ని పట్టించుకోకపోతే కండర క్షీణతతో ముడిపడిన ఊబకాయంలోకి జారపోవటం ఖాయం. డెక్సా, సీటీ, ఎంఆర్ఐ, మామూలు పిడికిలి పట్టు, నడక (గెయిట్) వేగం వంటి పరీక్షలతో కండర క్షీణతను ముందుగానే గుర్తించొచ్చు.

**బరువు చికిత్సలతో జాగ్రత్త**

ఊబకాయాన్ని తగ్గించుకోవటానికి ఇప్పుడు సెమాగ్లుటైడ్ వంటి జీఎల్‌పీ-1 రిసెప్టర్ ఎగొనిస్ట్ రకం మందులు విరివిగా వాడుతున్నారు. ఇవి బరువును సమర్థంగా తగ్గిస్తుండొచ్చు గానీ కొన్ని దుష్ప్రభావాలూ పొంచి ఉంటున్నాయి. వీటిల్లో ముఖ్యమైంది పలుచని కండరాల మోతాదు తగ్గటం. ఈ మందులను ఆపేసిన ఏడాది తర్వాత చాలామందిలో మూడింట రెండొంతుల బరువు తిరిగి పెరిగినట్టు పరిశోధనలు చెబుతున్నాయి. అదే సమయంలో జీవక్రియ ఆరోగ్యమూ బాగా దెబ్బతినటం గమనార్హం. అంటే కండరాలు క్షీణించటం వల్లనే బరువు తగ్గిందని ఇది సూచిస్తోందన్నమాట. బరువు తగ్గటానికి చేసే బేరియాట్రిక్ శస్త్రచికిత్సలతోనూ పలుచని కణజాలం తగ్గుతుంది. ఇది తగ్గటం వల్ల జీవక్రియ బలహీనం కావటమే కాదు, ఆకలీ పెరుగుతుంది. దీంతో తిరిగి బరువు పెరిగే ప్రమాదముంది. అదే క్రమబద్ధమైన వ్యాయామం, సమతులాహారం వంటి జీవనశైలి మార్పులైతే చాలా సురక్షితం. మందులతో ఒనగూరే దుష్ప్రభావాలేవీ ఉండవు. బరువు తగ్గటం దీర్ఘకాలం కొనసాగుతుంది కూడా.


**కేలరీల తగ్గింపు, వ్యాయమం రెండూ..**

శరీరం ఖర్చు చేసే దాని కన్నా ఎక్కువ కేలరీల శక్తినిచ్చే ఆహారం తినటం ఊబకాయానికి దారితీస్తుంది. అందువల్ల కేలరీలు తగ్గించుకోవటం చాలా ముఖ్యం. తక్కువ ఆహారం తినటం లేదా శారీరక శ్రమ పెంచటం ద్వారా దీన్ని సాధించొచ్చు. రెండూ కలిస్తే ఎక్కువ లాభం కలుగుతుంది. రోజువారీ పనులకు అవసరమైనంత ఆహారం తీసుకుంటే కొవ్వును తగ్గించుకోవటంతో పాటు కండరాలు క్షీణించకుండానూ చూసుకోవచ్చు. ఇక వ్యాయామాలు కూడా చేసినట్టయితే కండరాలు దృఢంగా అవుతాయి.

**రెండూ కలిస్తే?**

కండర క్షీణత, ఊబకాయం రెండూ కలిస్తే మరింత ప్రమాదం ముంచుకొచ్చినట్టే. ఎందుకంటే అధిక కొవ్వు మోతాదు కండర క్షీణతను దాచిపెడుతుంది. అందువల్ల సమస్యను చాలాసార్లు పోల్చుకోలేరు కూడా. కొవ్వు మూలంగా లావుగా ఉన్నట్టు అనిపించినా దుర్బలత్వం, వైకల్యం, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, గుండెజబ్బు, పక్షవాతం, అకాల మరణం ముప్పులు పెరుగుతాయి.

# ప్రొటీన్ ఎక్కువ తీసుకుంటున్నారా..? అయితే ఈ సమస్యలు వస్తాయి.. జాగ్రత్త..!




మానవుని శరీరానికి ప్రోటీన్లు చాలా అవసరం. వీక్ గా ఉన్నప్పుడు కానీ.. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు గానీ డాక్టర్లు ప్రొటీన్లు ఉండే పదార్థాలు వాడాలని సూచిస్తారు. శరీరానికి అవసరమైన సూక్ష్మపోషకాల్లో ప్రొటీన్ ఒకటి. ప్రొటీన్ అమైనో ఆమ్లాలుగా విచ్ఛిన్నం కావడం వల్ల శరీరంలో కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. దీనితో పాటుగా ఇది హార్మోన్లను నియంత్రిస్తుంది. అలాగే న్యూరోట్రాన్స్మిటర్లు, రోగనిరోధక పనితీరుకు కూడా చాలా అవసరమవుతుంది. అయితే ప్రొటీన్లు ఎక్కువగా వాడటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయో తెలుసుకుందాం. ముఖ్యంగా ప్రొటీన్లు ఎక్కువగా కలిగిన ఆహారం తింటే బరువు తగ్గొచ్చని డాక్టర్లు చెబుతుంటారు. కానీ అలాంటి ఆహారం తిన్నప్పుడు స్వల్పంగా అయితే బరువు తగ్గుతారు.. కానీ భవిష్యత్ లో మళ్లీ బరువు పెరగడానికి ఆస్కారం ఉంటుంది. ఎందుకంటే శరీరంలో కొవ్వువలే ఎక్కువ ప్రొటీన్ నిల్వ ఉండటంతో.. అమైనో ఆమ్లాల పరిణామం పెరుగుతుంది. దీంతో మళ్లీ బరువు పెరిగేందుకు ఛాన్స్ ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జంతువులతో వచ్చే ప్రొటీన్ తీసుకుంటూ, ఆహారంలో పండ్లు, కూరగాయలు వంటి ఫైబర్ ఎక్కువగా ఉండే మొక్కల ఆహారాన్ని తీసుకోకపోతే.. మీకు మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంది. అలాగే ఉబ్బరం వంటి ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తాయి. అంతేకాకుండా ప్రొటీన్లు అధికంగా తీసుకోవడం వల్ల నోటి నుంచి దుర్వాసన వస్తుంది. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లను బాగా తగ్గించినప్పుడు వాసన మరింత ఎక్కువవుతుంది. ఫైబర్ లేని పాలు, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని ఎక్కువ మొత్తంలో తీసుకుంటుంటే మీకు విరేచనాల సమస్య వచ్చే అవకాశం ఉంది.

అయితే ఒక వ్యక్తి వారి వయస్సు, లింగం, శరీర బరువు, శరీర కూర్పు, శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి శారీరక శ్రమలో పాల్గొనకపోతే.. వారు వారి శరీర బరువులో కిలోగ్రాముకు కనీసం 0.8 గ్రాముల ప్రోటీన్ ను క్రమం తప్పకుండా తీసుకోవాలి. మీరు రోజులో 1 గంట పాటు వ్యాయామాలు చేస్తే మీ శరీరంలోని 3 కిలోలకు 1.2 నుంచి 1.7 గ్రాముల ప్రోటీన్ ను తీసుకోవాలంటూ ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



# తిండి విషయంలో ఈ తప్పులు చేయొద్దు!

## మానవాళి ఆరోగ్యంపై తిండి అలవాట్ల ప్రభావం

## ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయంటున్న పరిశోధకులు

## మధ్యాహ్న భోజన విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచన

మానవుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అనేక అంశాలలో తిండి అలవాట్లు కూడా ముఖ్యమైనవే. ఆహారపు అలవాట్లు వ్యక్తుల ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయని పరిశోధకులు అంటున్నారు. తిండి విషయంలో చేసే కొన్ని తప్పులు చిన్నవే అయినా దీర్ఘకాలంలో చేటు చేస్తాయని, ప్రమాదకర జబ్బులకు దారితీస్తాయని చెబుతున్నారు. ఆహారం విషయంలో కొన్ని అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అవేంటో చూద్దాం...

ఉదయం అల్పాహారం తినకుండా మధ్యాహ్న భోజనం పీకల దాకా లాగించడం
తిన్నవెంటనే పనిచేయడం
మంచినీరు తక్కువగా తీసుకోవడం
పిచ్చిపట్టినట్టుగా తినడం
నిర్దిష్ట సమయం అంటూ లేకుండా ఎప్పుడంటే అప్పుడు లంచ్ చేయడం.
మధ్యాహ్న భోజన సమయంలో కనీసం స్నాక్స్ అయినా తీసుకోకపోవడం
లంచ్ లో ఎప్పుడూ జంక్, ప్రాసెస్డ్ ఫుడ్ తినడం
మధ్యాహ్నం భోజనం చేయాల్సిన సమయంలో టీ, కాఫీలు తాగడం
హడావిడిగా తినడం
పోషక విలువలున్న ఆహారానికి లంచ్ లో చోటివ్వకపోవడం
లంచ్ కు ఓ ప్రణాళిక అంటూ లేకపోవడం
మధ్యాహ్న భోజనంలో సమతుల ఆహారం తీసుకోకపోవడం

ఈ అలవాట్లన్నీ అప్పటికప్పుడేమీ ప్రభావం చూపవు, కానీ నిదానంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి మొదట్లో వీటి లక్షణాలు ఓ మోస్తరుగానే అనిపించినా, కాలక్రమంలో కోలుకోలేనంతగా నష్టం వాటిల్లుతుంది.
సరైన రీతిలో మధ్యాహ్న భోజనం చేయకపోతే శరీరం తగినంత మోతాదులో కీలక విటమిన్లను, ఖనిజలవణాలను స్వీకరించలేదు. అస్తవ్యస్త భోజన సమయాలు మొదట జీర్ణవ్యవస్థను నాశనం చేస్తాయి. దాంతో ఉదరంలో జీర్ణరసాల ఉత్పత్తిలో సమతుల్యత ఉండదు. మొదట్లో చిన్న సమస్యలే అనుకున్నవి ఆ తర్వాత తీవ్రస్థాయికి చేరతాయి.
ప్రధానంగా, సక్రమమైన తిండి అలవాట్లు లేకపోతే మధుమేహం బారినపడే ముప్పు ఎక్కువ. సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం, మధ్యాహ్న భోజనం వరకు పరగడుపునే ఉండడం శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను కుదుపులకు గురిచేస్తాయి. దాంతో బ్లడ్ సుగర్ హెచ్చుతగ్గులకు లోనవుతుంది.
ఇక, కొన్ని రకాల ఆహార పదార్థాలు క్యాన్సర్ కు దారితీస్తాయి. ఒబేసిటీతో పాటు 13 రకాల క్యాన్సర్లకు అనారోగ్యకర ఆహారమే కారణమని పరిశోధకులు గుర్తించారు. మెనింజియోమా, థైరాయిడ్, అడెనోకార్సినోమా, ఈసోఫేగస్, మల్టీపుల్ మైలోమా, కిడ్నీ, యూట్రస్, ఓవరీ, లివర్, గాల్ బ్లాడర్, ఉదరం, ప్యాంక్రియాస్, బ్రెస్ట్ క్యాన్సర్ లకు అనారోగ్యకరమైన తిండికి సంబంధం ఉందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.
మధ్యాహ్న భోజనంలో బలమైన పోషకాహారం తీసుకోకపోతే గుండె బలహీనపడుతుంది. అదే సమయంలో గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఉప్పు మోతాదు మించరాదు. ప్రతిరోజు పెద్దవాళ్లు 2,300 ఎంజీ కంటే ఎక్కువ ఉప్పు తీసుకోరాదు. అయితే ప్రస్తుతకాలంలో ప్యాకేజ్డ్ ఫుడ్స్ రూపంలో మనకు తెలియకుండానే ఉప్పు అధికంగా తీసుకుంటున్నాం. ఆరోగ్యకరమైన ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సోడియం వినియోగాన్ని నియంత్రించవచ్చు.

# 2026 సంక్రాంతి.. కడుపు చెక్కలేనా?





టాలీవుడ్లో క్రేజీయెస్ట్ సీజన్ అయిన సంక్రాంతికి.. ఎక్కువగా ఫ్యామిలీ ఎంటర్టైనర్లను రిలీజ్ చేయడానికే ప్రయత్నిస్తుంటారు. ఆ టైంలో సీజన్‌కు తగ్గ సినిమా పడి, దానికి పాజిటివ్ టాక్ వస్తే వసూళ్ల మోత మోగిపోతుందన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఏకంగా రూ.300 కోట్ల వసూళ్లు రాబట్టిందంటే అందులో ఫ్యామిలీ ఆడియన్సుని మెప్పించే లక్షణాలుండబట్టే. దీని ముందు సీరియస్ సినిమాలైన గేమ్ చేంజర్, డాకు మహారాజ్ నిలవలేకపోయాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే వచ్చే సంక్రాంతికి పర్ఫెక్ట్ సీజన్ సినిమాలనే రెడీ చేస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఫిక్స్ అయిన మూడు చిత్రాలూ కామెడీ ప్రధానంగా సాగే ఎంటర్టైనర్లే కావడం విశేషం. కాబట్టి పండక్కి ప్రేక్షకుల కడుపులు చెక్కలవడం గ్యారెంటీ అనిపిస్తోంది.ముందుగా సంక్రాంతి బరిలో నిలిచిన 'మన శంకర వరప్రసాద్' జానరేంటి అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అనిల్ రావిపూడి సినిమా అంటే కామెడీనే ప్రధాన ఆకర్షణ. చిరుతో కూడా అతను అలాంటి సినిమానే చేస్తున్నాడు. ఇంకా సినిమా నుంచి టీజర్ రాలేదు కానీ.. అది వచ్చినపుడు కామెడీనే హైలైట్ అవుతుందని భావిస్తున్నారు. యాక్షన్ టచ్ ఉన్నా సరే.. ఎంటర్టైన్మెంటే ప్రధాన లక్ష్యంగా సినిమా సాగే అవకాశాలు న్నాయి. ఇక నవీన్ పొలిశెట్టి చిత్రం 'అనగనగా ఒక రాజు' కూడా ఫుల్ లెంగ్త్ ఎంటర్టైనర్ అని దాని ప్రోమోలు సంకేతాలు ఇచ్చాయి. ప్రమోషనల్ వీడియోల్లో కూడా ఫన్ జనరేట్ చేయడానికే ప్రయత్నించారు. ఇక లేటుగా పండుగ రేసులో నిలిచిన ప్రభాస్ సినిమా 'రాజా సాబ్' కూడా వినోద ప్రధానంగా సాగబోతోందని అర్థమవుతోంది. ఇందులో హార్రర్ కూడా ఉన్నప్పటికీ.. దాన్ని మించి కామెడీనే హైలైట్ అయ్యేలా ఉంది. హార్రర్ కామెడీలు తీయడంలో మారుతి అందెవేసిన చేయి. ప్రభాస్ అనేసరికి ఇంకా డోస్ పెంచినట్లున్నాడు. వేరే ఆకర్షణలు ఎన్ని ఉన్నా ఇందులో ప్రేక్షకులను నవ్వించడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రభాస్ చాన్నాళ్ల తర్వాత కామెడీ చేయడం చూడబోతున్నాం. ఇలా వచ్చే సంక్రాంతికి వచ్చే సినిమాలన్నీ వినోద ప్రధానంగానే సాగేలా ఉండడంతో ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వుకోవచ్చన్నమాట.

# హాట్ డోస్ పెంచేసిన ఆయిషా శర్మ.. కుర్రకారుకు నిద్రపడుతుందా?



ప్రస్తుత కాలంలో పాపులారిటీ కోసం చాలామంది హీరోయిన్స్ సోషల్ మీడియా ను వేదికగా చేసుకుంటున్నారు. తమకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని కూడా అభిమానులతో పంచుకుంటున్నారు. కొంతమంది గ్లామర్ ఫోటోలతో ఫాలోవర్స్ ను పెంచుకుంటే.. మరికొంతమంది తమ వ్యక్తిగత విషయాలతో, ఆసక్తికర అంశాలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. ఇంకొంతమంది వస్త్రధారణతో కూడా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొంతమంది హీరోయిన్లు ఏకంగా బికినీలు ధరించి హాట్ డోస్ పెంచేసి కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తున్నారని చెప్పవచ్చు.

అలా బికినీ లతో సంచల నం సృష్టిస్తూ.. భారీ పాపులారిటీ సొంతం చేసుకుంటున్న వారిలో ప్రముఖ నటి ఆయిషా శర్మ కూడా ఒకరు. మోడల్ గా కెరియర్ ను ఆరంభించిన ఈమె.. ఆ తర్వాత నటిగా తనకంటూ ఒక గుర్తింపును సొంతం చేసుకుంది. అంతేకాదు మ్యూజిక్ వీడియోలలో కూడా కనిపించి సందడి చేసింది ఈ ముద్దుగుమ్మ.

ఇదిలా ఉండగా ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో నిత్యం గ్లామర్ ఒలకబోస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. తాజాగా బికినీని తలపించేలా బ్లాక్ కలర్ అవుట్ ఫిట్ లో దర్శనమిచ్చింది. ఒకవైపు తన ఎద అందాలను హైలెట్ చేస్తూనే.. మరోవైపు నడుము నాభి అందాలతో గిలిగింతలు పెట్టింది. థైస్ అందాలతో రచ్చ చేసిన ఈ ముద్దుగుమ్మ.. బెడ్ పై వెల్లకిలా పనుకొని ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు కుర్రకారు గుండెల్లో రైలు పరిగెట్టేలా చేస్తోంది.ఆయిషా శర్మ షేర్ చేసిన ఈ ఫోటోలు కుర్రకారులో హీట్ పెంచేశాయి. ఈ ఫోటోలు చూసిన ఫాలోవర్స్ తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఫైర్, లవ్ సింబల్ ఎమోజీలతో కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు అని చెప్పవచ్చు. ప్రస్తుతం ఆయిషా శర్మకు సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

ఆఈషా శర్మ విషయానికొస్తే 1989 జనవరి 25వ తేదీన బీహార్ భాగల్పూర్ లో జన్మించింది. మొదట ఆయుష్మాన్ ఖురానా ఐక్ వారి మ్యూజిక్ వీడియోలో నటించిన ఈమె.. ఆ తర్వాత హిందీ యాక్షన్ థ్రిల్లర్ సత్యమేవ జయతే సినిమా ద్వారా నటిగా ఇండస్ట్రీకి పరిచయమైంది.. 2018లో వచ్చిన ఈ సినిమా మంచి విజయం అందుకుంది. ఇందులో జాన్ అబ్రహం తో పాటు మనోజ్ బాజ్ పేయ్ కీలకపాత్రలు పోషించారు. ఇకపోతే ఈమె ఈ చిత్రం తర్వాత మరో చిత్రంలో నటించలేదు. కానీ 2022లో షైనింగ్ విత్ శర్మాస్ వెబ్ సిరీస్ లో నటించింది.

లాక్మే, పెప్సీ, క్యాంపస్ షూస్ తో సహా అనేక ప్రసిద్ధ బ్రాండ్లకు మోడల్ గా వ్యవహరించిన ఈమె.. 2016లో కింగ్ ఫిషర్ క్యాలెండర్ గర్ల్స్ లో ఒకరిగా కూడా ఎంపిక అయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఇలా గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది.



## హర్షిత గౌర్ తన చిక్ పోస్ట్‌తో అభిమానుల ను ఆకట్టుకుంది